RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక - 04 పేజీలు - 05 వెల - 04/- గురువారం 26 సెప్టెంబర్ 2024

# ఉద్యమ స్ఫూర్తితో కలసికట్టుగా పని చేశాం


**నష్టపరిహారం ను ఖాతాలలో జమ చేసిన చంద్రబాబు**

- వరద బాధితులను అన్ని విధాల ఆదుకున్నాం
- అందరి సమిష్టి కృషితోనే ఇది సాధ్యమైంది
- రూ 400 కోట్లు దాతలు విరాళాలిచ్చారు
- బాధితులకు రూ.602 కోట్లు సాయం
- ఒక్కొ కుటుంబానికి రూ 25 వేల సాయం




అమరావతి,సెప్టెంబర్25 ఆంధ్ర ప్రగతి:
వరద సమయంలో అందరం కలిసి ఉద్యమ స్ఫూర్తితో ముందుకెళ్లినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఎన్టీఆర్ కలెక్టరేట్ లో నేడు జరిగిన వరద బాదితులకు నగదు సాయం పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సీఎం తన చేతుల మీదగా పలువురికి నష్టపరిహారం అందజేశారు. **మిగతాది 2లో...**

# ఏపీలో 16 మంది ఐపీఎస్ ల బదిలీ...




- సీఐడీ ఐజీగా వినీత్ బ్రిజ్ లాల్
- ఏపీలో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం
- మరోసారి ఐపీఎస్ లకు స్థానచలనం
- ఇంటెలిజెన్స్ ఐజీగా రామకృష్ణ

అమరావతి,సెప్టెంబర్25 ఆంధ్ర ప్రగతి:
ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరోసారి ఐపీఎస్ లకు స్థానచలనం కలిగింది. నేడు 16 మంది ఐపీఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. సీఐడీ ఐజీగా వినీత్ బ్రిజ్ లాల్ ను నియమించింది. పీ అండ్ ఎల్ ఐజీగా ఎం.రవిప్రకాశ్, ఇంటెలిజెన్స్ ఐజీగా రామకృష్ణ, ఇంటెలిజెన్స్ ఎస్పీగా ఫకీరప్ప, డీజీపీ కార్యాలయంలో డీఐజీ (అడ్మిన్)గా అమ్మిరెడ్డి, రోడ్ సేఫ్టీ అథారిటీ డీఐజీగా సీహెచ్ విజయరావు, లా అండ్ ఆర్డర్ ఏఐజీగా సిద్ధార్థ్ కౌశల్, విశాఖ శాంతిభద్రతల డీసీపీగా మేరీ ప్రశాంతి, అనకాపల్లి ఎస్పీగా తుహిన్ సిన్హా, ఏపీఎస్పీ-3 బెటాలియన్ కమాండెంట్ గా దీపిక, ఒంగోలు పోలీస్ శిక్షణ కళాశాల (పీటీసీ) ప్రిన్సిపల్ గా జి.రాధిక, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ విభాగం ఎస్పీగా ఆరిఫ్ హఫీజ్, పీటీవో ఎస్పీగా కె.ఎస్.ఎస్.వి సుబ్బారెడ్డి, పోలీస్ హెడ్ క్వార్టర్స్ కు అటాచ్డ్ గా బాపూజీ అట్టాడ, ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్ లో క్రైమ్ డీసీపీగా తిరుమలేశ్వర్ రెడ్డి, పోలీస్ హెడ్ క్వార్టర్స్ కు అటాచ్డ్ గా శ్రీనివాసరావులను బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# వైసీపీకి మరో షాక్..

**మాజీ ఎమ్మెల్యే రెహ్మాన్ రాజీనామా.!**





-రాజీనామా లేఖను జగన్ కు పంపించిన రెహ్మాన్.

-పాలనలో వైసీపీ పూర్తిగా విఫలమయిందన్న మాజీ ఎమ్మెల్యే.

# 28న కాలినడకన తిరుమలకు జగన్

**ఆలయాల్లో పూజలకు వైసిపి పిలుపు**



అమరావతి,సెప్టెంబర్25 ఆంధ్ర ప్రగతి:
వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఈనెల 28న తిరుమలకు కాలినడకన వెళ్లనున్నారు. లడ్డూ వ్యవహారంలో చంద్రబాబు చేసిన ఆరోపణలతో తిరుమల ఆలయ పవిత్రతను, స్వామివారి ప్రసాదం విశిష్టతను మంటగలిపారని పేర్కొంటూ వైసీపీ ఆలయాల్లో పూజలకు పిలుపునిచ్చింది. ఈనెల 28న రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో పూజలు చేపట్టాలని వైఎస్ జగన్ ట్విట్టర్ వేదిక ద్వారా పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఆయన తిరుమల వేంకటేశ్వరస్వామి వద్దకు మెట్ల మార్గాన వెళ్లనున్నారు. తిరుమల లడ్డూ పవిత్రతను, స్వామివారి ప్రసాదం విశిష్టతను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు వైసీపీ పూజలకు పిలుపునిచ్చింది. ఈ మేరకు వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం ఎక్స్ వేదిక ద్వారా వైసీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వెంకటేశ్వరస్వామి వైభవాన్ని, టీటీడీ పేరు ప్రఖ్యాతులను, లడ్డూ పవిత్రతను, రాజకీయ దుర్బుద్ధితో, కావాలని అబద్ధాలాడుతున్నాని దుయ్యబట్టారు. జంతువుల కొవ్వుతో కల్తీ జరగనిది జరిగినట్టుగా, ఆ కల్తీ ప్రసాదాన్ని భక్తులు తిన్నట్టుగా, అసత్య ప్రచారంతో ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు.

# రాజకీయ లబ్ధి కోసమే కల్తీ ప్రచారం

**సిఎం చంద్రబాబుపై మండిపడ్డ పేర్ని నాని, కొడాలినాని**




అమరావతి,సెప్టెంబర్25 ఆంధ్ర ప్రగతి:
తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని మాజీ మంత్రులు, వైసీపీ నాయకులు పేర్ని నాని, కొడాలి నాని ఆరోపించారు. రాజకీయ లబ్ది పొందాలనుకుంటే ఆ వేంకటేశ్వరస్వామి చంద్రబాబును క్షమించడని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా కొడాలి నాని తాడేపల్లి వైసీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గత టీడీపీ , వైసీపీ పాలనలో తిరుమలకు సరఫరా అయిన నెయ్యిలో కల్తీ ఉందని నెయ్యి ట్యాంకర్లను వెనక్కు పంపిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే శ్రీవారి ప్రతిష్టను మంటగలిపేలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. లడ్డూపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కల్తీ నెయ్యిని ఎప్పుడూ తిరుమలలో వాడలేదని స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధికోసమే జంతువుల కొవ్వు ప్రస్తావన తీసుకొచ్చారని వారు విమర్శించారు. జంతువుల నూనె కలిసిందని ఎవరూ నివేదిక ఇవ్వలేదని తెలిపారు. తిరుమలలో చంద్రబాబు ఎన్నిసార్లు తలనీలాలు సమర్పించారని, ఎన్నిసార్లు కాలినడకన స్వామివారిని దర్శించుకున్నారని ప్రశ్నించారు. చంద్రబాబు అసలు వేంకటేశ్వరాస్వామి భక్తుడు కాదని ఆరోపించారు. టీడీపీ నాయకులు బరితెగించి వైసీపీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని పేర్కొన్నారు.

# దేశంలోనే నెంబర్ 1 రాష్ట్రంగా ఏపీ.!




- మంత్రి నారా లోకేశ్.
- చంద్రబాబు నేతృత్వంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా అడుగులు.
- దేశంలో ఐదో అతిపెద్ద ఆర్థిక నగరంగా విశాఖపట్నాన్ని తీర్చిదిద్దుతామన్న లోకేశ్.
- 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని పిలుపు.
- విశాఖలో డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్, అంతర్జాతీయ స్థాయి డాటా సెంటర్.

# వన్యప్రాణులను సంరక్షిస్తూనే అభివృద్ధి ప్రాజెక్టులకు సహకరించాలి.!

**-రాష్ట్ర వన్యప్రాణి బోర్డు స్టాండింగ్ కమిటీ సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.**

ఆంధ్ర ప్రగతి మంగళగిరి సెప్టెంబర్ 25:
రాష్ట్రంలో ఉన్న వన్యప్రాణి కారిడార్లు, అభయారణ్యాల్లోని వన్య ప్రాణుల జీవనానికి ఎలాంటి అవరోధాలు లేకుండా చర్యలు చేపట్టాలని, వాటి సంరక్షణకు తగిన వాతావరణం కల్పించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. అదే విధంగా ఆ కారిడార్లు పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి ప్రాజెక్టులు ముందుకు వెళ్ళేందుకు సహకరించాలన్నారు. బుధవారం రాత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వన్యప్రాణి బోర్డు స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వన్యప్రాణి సంరక్షణతోపాటు, భారతమాల పరియోజన ద్వారా చేపట్టే నాలుగు వరుసల రోడ్డు నిర్మాణం, షార్ సమీపంలో తీరప్రాంత రక్షణ, జెట్టీ నిర్మాణం , కడప - రేణిగుంట మధ్య రైల్వే లైన్ లో రోడ్లు నిర్మాణాలకు శాఖాపరంగా ఇచ్చే అనుమతులపై చర్చించారు. వీటికి సంబంధించి అనుమతులు ఇచ్చే సందర్భంలో అవసరమైన ఉపశమన ప్రణాళికలు కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఉప



ముఖ్యమంత్రి సూచించారు. ఇతర రాష్ట్రాల్లోని టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ల్లో చేపట్టిన ప్రాజెక్టులకు ఎలాంటి విధానాలు అనుసరించారో అధికారులు వివరించారు. నేషనల్ టైగర్ కంజరేషన్ అథారిటీ, జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలు ఈ ప్రాంతాల్లో అధ్యయనం చేసి తగిన ఉపశమన ప్రణాళికలు సూచించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాము, పీసీసీఎఫ్ ఎ.కె.నాయకు, స్టాడింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# ఉద్యమ స్ఫూర్తితో కలసికట్టుగా పని చేశాం

(మొదటి పేజీ తరువాయి)

అలాగే ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ నుంచి నేరుగా నష్టపరిహారం సొమ్మును చంద్రబాబు బాధితుల ఖాతాల్లో జమచేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వరద సహాయక కార్యక్రమాలలోనే ఎక్కువ సమయం వెచ్చించానని అన్నారు. రూ. 400 వందల కోట్ల రూపాయలు సీఎం సహాయ నిధికి వచ్చాయని.. వరద సహాయ కార్యక్రమంలో అధికారులు మంత్రులు ఒక స్పిరిట్‌తో పనిచేశారని చెప్పారు. ఇంత పెద్ద ప్రకృతి విపత్తులో తనతో పాటు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది 10 -11 రోజుల పాటు నిర్విరామంగా పని చేశారని చంద్రబాబు కొనియాడారు. వరద నీటిలో ఉన్న బాధితులకు అన్ని రకాలుగా సాయం అందించే ప్రయత్నం చేశామన్నారు. ఇంత పెద్ద విపత్తులో చిన్న చిన్న ఇబ్బందులు కూడా ఉంటాయని, ఆఖరు బాధితుడికి కూడా సాయం అందలన్నదే తమ లక్ష్యమని సీఎం వ్యాఖ్యానించారు. "పెద్ద విపత్తు కలిగినప్పుడు అందరం ఒక్కటై పనిచేయగలిగాం. ఒకవైపు వర్షపు నీరు వస్తుంటే.. మరోవైపు




బుడమేరు నీరు పోటెత్తింది. అధికార యంత్రాంగంతో పాటు నేను స్వయంగా బురదలో దిగాను. తక్కువ సమయంలో విపత్తు నుంచిబయటపడగలిగాం. విరాళాల కోసం రాష్ట్రప్రజలంతా బ్రహ్మాండంగా స్పందించారు. వరద బాధితులకు సాయం చేద్దామని పిలుపునిస్తే అంతా ముందుకొచ్చారు అని అన్నారుఇప్పటివరకు రూ. 400 కోట్ల మేర సీఎం సహాయ నిధికి డబ్బులు వచ్చాయి. చిన్నా పెద్దా అందరూ స్పందించారు. సంఘటితంగా ఉంటే ఎలాంటి విపత్తు అయినా ఎదుర్కొంటాం. రూ. 602 కోట్లు ఇప్పటివరకు బాధితులకు విడుదల చేశాం. ఇందులో రూ. 400 కోట్లు దాతలు ఇచ్చినవే. మొత్తం నష్టం రూ. 6,800 కోట్ల మేర జరిగింది. 16 జిల్లాలు ప్రభావితం అయ్యాయి. మొత్తం 4 లక్షల మందికి ఆర్థిక సాయం అందించాం. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కిరాణ దుకాణాలు, తోపుడు బండ్లకు సహాయం చేస్తున్నాం. నష్టపోయిన పంటలకు సాయం అందిస్తున్నాం. ఇళ్లు మునిగిన వారికి రూ. 25 వేలు చొప్పున, మొదటి అంతస్తులో ఉన్న వారికి రూ. 10 వేల చొప్పున ఆర్థిక సాయం చేశాం" అని చంద్రబాబు తెలిపారు.

## పార్టీ కోసం కష్టపడినవారికే పదవుల్లో తొలి ప్రాధాన్యం

**కొందరు తొందరపడుతున్నారు...**
**అది మంచి పద్ధతి కాదు: సీఎం**
**కొత్తగా నియమితులైన చైర్మన్లతో నేడు చంద్రబాబు సమావేశం**
**ఎలా నడుచుకోవాలో దిశానిర్దేశం**



అమరావతి,సెప్టెంబర్25 ఆంధ్ర ప్రగతి:ఏపీలో కూటమి ప్రభుత్వం నిన్న 99 మందికి నామినేటెడ్ పదవులు కేటాయించిన సంగతి తెలిసిందే. 20 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించింది. కాగా, కార్పొరేషన్ చైర్మన్లుగా నియమితులైన వారితో సీఎం చంద్రబాబు రాష్ట్ర సచివాలయంలో నేడు సమీక్ష సమావేశం నిర్వహించారు. నామినేటెడ్ పదవులు పొందిన నేతలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... ముందుగా చెప్పినట్లు మూడు పార్టీల వారికి పదవులు ఇచ్చామని వెల్లడించారు. మొన్నటి ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో ప్రత్యేకమైన విధానాన్ని పాటించామని, మంచి ఫలితాలు వచ్చాయని చెప్పారు. నేడు నామినేటెడ్ పదవుల విషయంలో మంచి కసరత్తు చేసి పదవులు ప్రకటించామని స్పష్టం చేశారు.

"ఫేజ్ 1లో ముందుగా కొందరికి పదవులు ఇవ్వగలిగాం. ఇంకా నామినేటెడ్ పోస్టులు ఉన్నాయి... లిస్టులు ఉంటాయి. కొందరు నాయకులు తొందర పడుతున్నారు... ఇది మంచి పద్దతి కాదు. మన పార్టీలో క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇస్తామని గుర్తుపెట్టుకోవాలి. పార్టీ టిక్కెట్ ఇవ్వలేకపోయిన వారికి మొదటి లిస్టులో కొంత వరకు అవకాశం ఇచ్చాం.

కష్టపడిన వారికి మొదటి లిస్టులో ముందుగా అవకాశాలు ఇచ్చాం... మీకు అవకాశాలు వచ్చాయి అంటే... మిగిలిన వారు పనిచేయలేదు అని కాదు, అర్హత లేదు అని కాదు. పార్టీ కోసం జైలుకు వెళ్లిన వాళ్లు, ఆస్తులు కోల్పోయిన వాళ్లు, కేసులు ఎదుర్కొన్న వారు ఉన్నారు. పార్టీకి ఎవరు ఎలా పనిచేశారో నా దగ్గర పూర్తి సమాచారం ఉంది. పార్టీ కోసం నిరంతరం పనిచేసిన వాళ్లు ఉన్నారు... ప్రతి ఒక్కరికి న్యాయం చెయ్యాలి అనే విషయంలో స్పష్టంగా ఉన్నాం. కష్టపడిన ఏ ఒక్కరినీ విస్మరించం. నామినేటెడ్ పదవుల్లో సామాజిక న్యాయం పాటించాం. జనాభా దామాషా లెక్కన బీసీలకు నామినేటెడ్ పదవుల్లో ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాం" అని చంద్రబాబు వివరించారు.

ఇక, నూతనంగా నామినేటెడ్ పదవులు పొందిన వారు ఎలా నడుచుకోవాలన్నదానిపైనా చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వంలో పదవి అనేది ఒక బాధ్యతని, మనలో ఎక్కడా అహంకారం కనిపించకూడదని స్పష్టం చేశారు. ఏ పదవిలో ఉన్నా మనం ప్రజా సేవకులం అన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు.

ఆర్టీసీని నిలబెట్టాలి... ఎలక్ట్రిక్ బస్సులు తేవాలి... కార్గో పెంచాలి. నేతలకే కాదు... ట్రాక్ రికార్డుల ఆధారంగా చిన్న స్థాయి నేతలకు కూడా కార్పొరేషన్ లలో అవకాశాలు ఇచ్చాం. బాగా పనిచేయండి... ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురండి. కష్టపడి పనిచేస్తే మరిన్ని మంచి అవకాశాలు వస్తాయి... మనకు వచ్చిన విజయాన్ని మరింత పెంచేలా ప్రతి ఒక్కరు పనిచెయ్యాలి.

సింపుల్ గవర్నమెంట్... ఎఫెక్టివ్ గవర్నెన్స్ అని నేను, పవన్ కళ్యాణ్ గారు చెప్పాం. అందరూ అదే పాటించాలి. 15 రోజుల్లో వరద సాయం అందించాం... మళ్లీ బాధితులను నిలబెట్టే ప్రయత్నం చేశాం. ఇదీ మన విధానం... దీనికి అనుగుణంగా మీరు పనిచేయాలి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో కలిసి, సమన్వయంతో మీరంతా పనిచేయాలని కోరుతున్నా. మీ వల్ల కూటమి ప్రభుత్వానికి పొలిటికల్ గెయిన్ ఉండాలి" అంటూ చంద్రబాబు అందరికీ ఆల్ ది బెస్ట్ చెప్పారు.

# వైసీపీకి మరో షాక్..
## మాజీ ఎమ్మెల్యే రెహ్మాన్ రాజీనామా.!




ఆంధ్ర ప్రగతి అమరావతి సెప్టెంబర్ 25: వైసీపీకి వరుస షాక్ లు తగులుతున్నాయి. పార్టీ నేతలు వరసగా పార్టీని వీడుతున్నారు. ముగ్గురు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ రావు, ఆర్ కృష్ణయ్య పార్టీకి, రాజ్యసభ సభ్యత్వాలకు రాజీనామా చేయడం ఆ పార్టీకి పెద్ద దెబ్బగానే చెప్పుకోవచ్చు. వీరితో పాటు ఇప్పటికే పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పార్టీని వీడారు. తాజాగా వైసీపీకి మరో షాక్ తగిలింది. మాజీ ఎమ్మెల్యే, వుడా మాజీ ఛైర్మన్ ఎస్ఏ రెహ్మాన్ వైసీపీకి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పార్టీ అధినేత జగన్ కు పంపించారు. ఈ సందర్భంగా రెహ్మాన్ మీడియాతో మాట్లాడుతూ... ముస్లింల ప్రయోజనాల కోసం కూటమి ప్రభుత్వం ఎంతో చేస్తోందని చెప్పారు. పాలనలో వైసీపీ అన్ని విధాలుగా విఫలమయిందని విమర్శించారు. ఎంసెట్ పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించలేకపోయిందని అన్నారు. అందుకే ఎన్నికల్లో వైసీపీని ప్రజలు దూరం పెట్టారని, వైసీపీలో తాను ఇమడలేకపోతున్నానని పేర్కొన్నారు. కాగా, వైసీపీ ప్రారంభం నుంచి పార్టీలో రెహ్మాన్ చురుకుగా వ్యవహరించారు. రెహ్మాన్ పార్టీని వీడటం ఉత్తరాంధ్రలో వైసీపీకి పెద్ద దెబ్బగానే చెప్పుకోవచ్చు. మరోవైపు రెహ్మాన్ టీడీపీలో చేరనున్నట్లు సమాచారం.

# రాములోరి రథం నిప్పు వైసీపీ నాయకుడి అరెస్టు




అనంతపురం సెప్టెంబర్25 ఆంధ్ర ప్రగతి:

ఏపీలో సంచలనం సృష్టించిన రాములోరి రథానికి నిప్పుపెట్టిన దురాఘతంలో నిందితుడిని అనంతపురం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడు వైసీపీ నాయకుడని పోలీసులు స్పష్టం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లా కణేకల్ మండలం హన కనహళ్ గ్రామంలో రాములోరి రథానికి నిప్పు పెట్టిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై సాక్షాత్తు సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రథానికి నిప్పు పెట్టినోళ్లను సహించలేదని దర్యాప్తును ముమ్మరం చేసి నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన జిల్లా ఎస్పీ జగదీష్ బృందం 24 గంటల్లోనే రామాలయం రథానికి నిప్పు పెట్టిన నిందితులను అరెస్టు చేశారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో అనంతపురం జిల్లా కనేకల్ మండలం హనకనహళ్ గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు శ్రీరాములోరి రథానికి నిప్పు పెట్టారు. మండపంలో భద్రపరిచిన ఉండగా దుండగులు ఈ పని చేశారు. తాళాలు పగులకొట్టి, మండపంలోకి ప్రవేశించి రథంపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. విషయం తెలుసుకున్న స్థానికులు మంటలు ఆర్పారు. అప్పటికే రథం ముందు భాగం కాలి పోయింది.

సీఎం చంద్రబాబు ఆదేశాలతో హుటాహుటిన గ్రామానికి చేరుకున్న జిల్లా ఎస్పీ జగదీష్ అండ్ టీం దర్యాప్తు ముమ్మరం చేశారు. దర్యాప్తులో పలు కీలక అంశాలు గుర్తించారు. హనకనహళ్ గ్రామంలో శ్రీరాముల వారి రథాన్ని 2022లో ఎర్రస్వామి రెడ్డి బ్రదర్స్ సొంత డబ్బులు రూ. 20 లక్షలు ఖర్చు పెట్టి తయారు చేయించారు. ఇదే గ్రామస్తుల మధ్య విభేదాలకు కారణమైంది. ఆ విభేదాలతోనే రథానికి నిప్పు పెట్టారు. రాయ దుర్గం సీఐ వెంకట రమణ ఎస్ఐ నాగ మధు ఆధ్వర్యంలో కేసు విచారించి వైసీపీ కార్యకర్త బొడిమల్ల ఈశ్వర రెడ్డిని అరెస్టు చేశారు. బొడిమల్ల ఈశ్వర రెడ్డిని పోలీస్ కస్టడీకి తీసుకొని విచారిస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు అంటున్నారు. ఆ వ్యక్తిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

# దేశంలోనే నెంబర్ 1 రాష్ట్రంగా ఏపీ.!

ఆంధ్ర ప్రగతి విశాఖపట్నం సెప్టెంబర్ 25:
2047 నాటికి దేశంలో నెం.1 రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేయడానికి రూట్ మ్యాప్ సిద్ధం చేశామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో విశాఖ నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమ్మిట్‌కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమల స్థాపనకు గల అవకాశాలు, ఆర్థిక వనరులు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై నిర్వహించిన సదస్సుకు జాతీయస్థాయి ప్రముఖ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ... రాష్టంలో కొత్తగా ఏర్పాటైన కూటమి ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పన అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి గత ప్రభుత్వ చర్యల కారణంగా అయిదేళ్లుగా స్పీడ్ బ్రేకర్లు పడ్డాయని, అన్నివిధాలా నిర్లక్ష్యానికి గురైన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టడానికి అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు చెప్పారు. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా వేగవంతంగా ముందుకు సాగుతోందన్నారు.

చంద్రబాబు నేతృత్వంలో అభివృద్ధి వికేంద్రీకరణపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. అందులో భాగంగా ప్రతి జిల్లాలో ఒక రంగంపై దృష్టి సారించి ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. కర్నూలు జిల్లాలో రెన్యువబుల్ ఎనర్జీ అభివృద్ధిపై దృష్టి సారిస్తామని, రాబోయే అయిదేళ్లలో 72 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందులో భాగంగా హైడ్రో, విండ్, సోలార్ విద్యుతుత్పత్తి ప్రాజెక్టులు పెద్ద ఎత్తున అక్కడకు వస్తాయని ఆకాంక్షించారు.

అనంతపురం జిల్లాలో ఆటోమొబైల్ మ్యానుఫ్యాక్చరింగ్, చిత్తూరు, కడప జిల్లాల్లో ఎలక్ట్రానిక్స్ ఇండస్ట్రీస్, ప్రకాశం జిల్లాలో బయోఫ్యూయల్, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో క్యాపిటల్ రీజియన్, గోదావరి జిల్లాలో ఆక్వా ఉత్పత్తుల పరిశ్రమలను అభివృద్ధి చేస్తామన్నారు. రోడ్లు, మౌలిక సదుపాయాలు గత అయిదేళ్లుగా నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. గోదావరి జిల్లాల్లో గ్రీన్ ఎనర్జీ రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. దేశంలోనే అతిపెద్ద పెట్రో కెమికల్ కారిడార్ అక్కడ రాబోతుందన్నారు.

విశాఖపట్నాన్ని ప్రపంచంలోనే నెం.1 ఐటి హబ్‌గా తయారు చేయాలన్నది తమ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా అంతర్జాతీయ స్థాయి డాటా సెంటర్ అభివృద్ధి చేయబోతున్నామన్నారు. ఉత్తరాంధ్రను ఫార్మా హబ్‌గా తీర్చిదిద్దుతామని, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభయ్యాక విశాఖపట్నంతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలు విప్లవాత్మకమైన అభివృద్ధి సాధిస్తాయన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఎయిర్ కనెక్టివిటీ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

అయితే కేవలం పోర్టులు, ఎయిర్ పోర్టులు ఉంటే మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందినట్లు కాదని, ఆయా రంగాల్లో సాధించిన అభివృద్ధి ద్వారా వచ్చిన సంపద సమాజంలో అన్నివర్గాలకు పంపిణీ చేయడమే అసలైన అభివృద్ధి అన్నారు. దేశంలో రెండో అతిపెద్ద ఎయిర్ పోర్టుగా నేడు హైదరాబాద్ ఎయిర్ పోర్టు అభివృద్ధి చెందిందని, దీనిద్వారా సృష్టించిన సంపదతో తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. జీఎంఆర్ ఆధ్వర్యంలో భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణం ద్వారా విశాఖపట్నంలో దేశంలోనే మెరుగైన మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

విశాఖపట్నంను ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తయారు చేయడమే తమ ప్రభుత్వం లక్ష్యమన్నారు. ఆర్థిక రాజధానిగా విశాఖపట్నాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలో విశాఖలో డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ రాబోతుందన్నారు. విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పనులను వేగవంతం చేస్తామన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అన్నది గతం మాట... ఇప్పుడు చంద్రబాబు నేతృత్వంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ఇండస్ట్రీ ఫ్రెండ్లీ విధానాలతో త్వరలో కొత్త పారిశ్రామిక పాలసీ, ఐటి, ఎలక్ట్రానిక్స్ పాలసీలు ప్రకటిస్తామని తెలిపారు. రాష్ట్రంలో యువ ఐఏఎస్ అధికారి సారథ్యంలో ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డు (ఈడీబీ)ని పునరుద్ధరించినట్లు వెల్లడించారు. దీనిద్వారా సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ ద్వారా పరిశ్రమలకు అవసరమైన అనుమతులు ఇస్తామన్నారు.

ముఖ్యమంత్రి నేతృత్వంలో ఈడీబీ క్రియాశీలకంగా పని చేయబోతుందని, ప్రస్తుతం దేశంలో తొమ్మిదో అతిపెద్ద ఎకనమిక్ సిటీగా ఉన్న విశాఖను రాబోయే అయిదేళ్లలో ఐదో అతిపెద్ద ఆర్థిక నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పనకు జీఎంఆర్ చేస్తున్న కృషిని లోకేశ్ అభినందించారు. రాష్ట్రంలో రాబోయే అయిదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యసాధనలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలన్నారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వాన వేగవంతంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగా రూ. 17 వేల కోట్ల వ్యయంతో పిపిపి విధానంలో రామాయపట్నం, మచిలీపట్నం, భావనపాడు, కాకినాడ గేట్ వే పోర్టులు శరవేగంగా నిర్మితమవుతున్నాయన్నారు. రాష్ట్రంలో నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ పైప్‌లైన్‌లో ఉందన్నారు. మౌలిక సదుపాయాల వృద్ధిలో భాగంగా ఎయిర్ కనెక్టివిటీ పెంచుతున్నామన్నారు. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నిర్మాణం శరవేగంగా సాగుతోందని తెలిపారు. గ్లోబల్ మార్కెట్‌కు దీటుగా విశాఖపట్నంలో వరల్డ్ క్లాస్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేస్తామన్నారు.

పీపీపీ మోడ్‌లో క్రిటికల్ ఇన్‌ఫ్రా, హౌసింగ్ ప్రాజెక్టులు చేపడతామన్నారు. చంద్రబాబు మార్గనిర్దేశకత్వంలో ఇన్‌ఫ్రా అభివృద్ధిలో భాగంగా విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, హైదరాబాద్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, చెన్నై-బెంగుళూరు ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయన్నారు. కొత్తగా గ్రీన్ ఫీల్డ్ పోర్టులు రాబోతున్నాయన్నారు.

రాబోయే 18 నెలల్లో భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని విశాఖ ఎంపీ ముతుకుమిల్లి శ్రీభరత్ పేర్కొన్నారు. ఆర్థికాభివృద్ధిలో విశాఖపట్నం దేశంలో 10వ నగరంగా ఉండగా, ఎయిర్ కనెక్టివిటీ విషయంలో మాత్రం 27వ స్థానంలో ఉందన్నారు. ఈ గ్యాప్‌ను సరిదిద్దాల్సి ఉందని చెప్పారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక విశాఖపట్నం నుంచి ఇంటర్నేషనల్ ఎయిర్ కార్గో ప్రారంభమైందన్నారు. వ్యక్తిగత విద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసుకునేలా త్వరలో రాష్ట్రంలో పీఎం సూర్య పథకం ప్రారంభం కాబోతుందన్నారు. దీని ద్వారా విప్లవాత్మక మార్పులు రావడంతో పాటు చౌకగా విద్యుత్ లభిస్తుందన్నారు. విశాఖ నగరంలో ఇప్పటికే ప్రారంభమైన ఇన్‌ఫ్రా ప్రాజెక్టులపై మంత్రి లోకేశ్ దృష్టిసారించి, వేగంగా పూర్తిచేసేందుకు సహకరించాలని కోరారు.

షీలానగర్-సబ్బవరం రోడ్డు విస్తరణ పనులు పురోగతిలో ఉన్నాయని, అనకాపల్లి-భీమిలి రోడ్డు విశాఖపట్నం నగరం గుండా వెళ్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి 12 ఫ్లైఓవర్లను ప్రతిపాదించినట్లు చెప్పారు. ఎలివేటెడ్ హైవే రోడ్డు నిర్మించే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక మార్గాలను అన్వేషిస్తున్నట్లు చెప్పారు. అధునాతన టెక్నాలజీతో హౌసింగ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మంత్రివర్గంలో యువనాయకత్వంతో విశాఖనగరం వేగవంతంగా అభివృద్ధి సాధించబోతోందని, ఇందుకు పారిశ్రామికవేత్తలు తమవంతు సహాయ, సహకారాలు అందించాలన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం.!

## రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 25: ప్రజల సంక్షేమం, అభివృద్దే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. బుధవారం నంద్యాల నియోజకవర్గంలోని అయ్యలూరు మెట్ట గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం – ప్రజా వేదిక కార్యక్రమంలో మంత్రి ఎన్ఎండి ఫరూక్, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటై వంద రోజులు అయిన సందర్భంగా అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు స్వర్ణాంధ్ర 2047 పేరుతో పకడ్బందీ ప్రణాళిక రూపొందిస్తోందన్నారు. అమరావతిలో వరదలు వచ్చి ప్రజలు ఇబ్బందుల్లో వున్నప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా వరద బాధితులకు అండగా నిలబడి ఒక తండ్రిలా ప్రజల్ని కాపాడారని గుర్తు చేశారు. గత ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను తు.చ తప్పకుండా అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం అండగా ఉండి రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి తెలిపారు. ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఉన్నంతవరకు రాష్ట్రంలో ఆదర్శ పాలన కొనసాగుతుందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ దేశంలో అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు ఆంధ్ర రాష్ట్రం ఏమాత్రం తీసిపోకోకుండా అభివృద్ధి దిశలో పయనించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. విజయవాడలో ఇటీవల సంభవించిన వరదల కారణంగా నిరాశ్రయులైన బాధితులను ఆదుకునేందుకు అనేకమంది ముందుకు వచ్చి సీఎం సహాయనిధికి విరాళాలు ఇస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 100 రోజులలో చేపట్టిన కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. స్వర్ణాంధ్రఏ2047 దార్శనిక పత్ర రూపకల్పనలో భాగంగా క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తున్నామని ప్రజలందరూ సహకరించి అభివృద్ధి ప్రణాళికలో భాగస్వాములు కావాలని ఆమె సూచించారు. ఇది మంచి ప్రభుత్వంలో భాగంగా స్వర్ణాంధ్ర కరపత్రాలు, స్టిక్కర్లను ప్రతి ఇంటికి సచివాలయాల సిబ్బంది ద్వారా చేరవేస్తున్నామన్నారు. అంతకుముందు మంత్రి, జిల్లా కలెక్టర్ కు గ్రామస్తులు డప్పు, వాయిద్యాలతో అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం అయ్యలూరు మెట్ట ప్రాంత నివాసి కొమ్ము రమణారెడ్డి వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి 15,000 రూపాయల నగదు మొత్తాన్ని మంత్రికి అందజేశారు. పిదప రాష్ట్ర మంత్రి, జిల్లా కలెక్టర్ గ్రామంలోని వీధుల్లో పర్యటిస్తూ ఇది మంచి ప్రభుత్వ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఆర్డీవో మల్లికార్జున రెడ్డి, తహశీల్దార్ ప్రియదర్శిని, ఎంపీడీవో సుగుణశ్రీ, అధికారులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# ఆళ్లగడ్డ సబ్ డివిజన్ కు సంబంధించి నేర సమీక్షా సమావేశం.

### -నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా.

ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా సెప్టెంబర్ 25: నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా నంద్యాల జిల్లాలోని బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆళ్లగడ్డ సబ్ డివిజన్ కు సంబందించి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం నందు పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నమోదైన కేసుల్లో నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు తీరుతెన్నులు వాటి పురోగతిపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీసి కేసుల ఫైల్స్ ను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్ల వారీగా యూ ఐ కేసులు తగ్గించుకోవాలన్నారు. నిర్ణీత గడువులోపు పెండింగ్ కేసులను పరిష్కార దశకు తీసుకురావాలన్నారు.
హత్యలు, హత్యాయత్నాలు, క్రైమ్ అగైనెస్ట్ ఉమన్, గర్ల్ మిస్సింగ్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, 174 సిఆర్ పీసీ తదితర కేసులను సమీక్ష చేశారు. ఈ మిసింగ్ కేసులలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని త్వరితగతిన కనుగొనేలా చేయాలని ఆదేశించారు. నమోదైన కేసులలో సమగ్ర దర్యాప్తు నిర్వహించి నేరస్తులు తప్పించుకునే వీలు లేకుండా న్యాయ స్థానాలలో తగిన సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టి నేరస్తులకు శిక్ష పడే విధంగా అన్నీ ఆదారాలు సేకరించి చార్జిషీట్ ధాకాలు చేయాలన్నారు. పోలీసు స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాలను సీసీటీన్స్ లో ఎప్పటికప్పుడు పొందుపరచాలని తెలిపారు. ఆయా కేసుల



ఛేదింపునకు మరియు పరిష్కారానికి, నేర నియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు మరియు మెళకువలను అధికారులకు సూచించారు. హత్య కేసుల, పోక్సో కేసులు మరియు కేసులలో దర్యాప్తు వేగాన్ని పెంచాలని, హత్య మరియు ఇతర కీలకమైన కేసుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని దర్యాప్తు సమగ్రంగా చేపట్టాలని, మహిళల, చిన్నారుల అదృశ్యం కేసులలో ఏ విధమైన అలసత్వం చూపించకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని, తప్పిపోయిన వారిని పట్టుకొనుటలో నిబద్ధత చూపించాలని సూచించారు. ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా పట్టుకొని దొంగిలించిన సొత్తును రికవరీ చేయాలన్నారు. బీట్లు, పికెట్స్ ఏర్పాటు చేసుకొని అధికారులు తరుచుగా బీట్ చెక్ చేస్తూ సిబ్బందికి సూచనలు ఇవ్వాలన్నారు. దొంగతనాలు, దోపిడీలు, తదితర నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలకు వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. దొంగతనాలను అరికట్టేందుకు హైవే రహదారులపై వాహనాల తనిఖీలు చేస్తూ ప్రత్యేక చొరవ చూపాలని ,అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వేలి ముద్రలను తనిఖీ చేయాలి. లోన్ యాప్ ల మోసాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా చైతన్యం చేయాలన్నారు.
చట్ట వ్యతిరేక కార్యకలాపాలైన మట్కా, పేకాట, అక్రమ మద్యం రవాణాపై ముందస్తు సమాచారం సేకరించి వీటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి వంటి నిషేధిత మాదకద్రవ్యాలను రవాణా మరియు విక్రయించే వారిపై ఎన్ డి పి ఎస్ కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి రవాణా పై ప్రత్యేక దృష్టి సారించి ఎన్ డి పి ఎస్ కేసులను డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షించాలి. వీటిని అరికట్టడం వల్ల చిన్న పిల్లలను మరియు యువతను కాపాడుకోగలుగుతాము. అధికారులు ఎప్పటికప్పుడు మారుతున్న చట్టాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించుకుని ప్రతి పోలీసు అధికారి బాధ్యతగా వ్యవహరించాలి పూర్తిస్థాయిలో విచారణ దర్యాప్తు చేసి ఖచ్చితమైన ఆధారాలతో కోర్టుకు సమర్పించి బాధితులకు సరైన న్యాయం చేయాలన్నారు. ఈ కార్యాక్రమం నందు జిల్లా ఎస్పీ తో పాటు ఆళ్లగడ్డ డి.ఎస్.పి కె.రవికుమార్, మోహన్ రెడ్డి, విజయభాస్కర్, ఆదినారాయణ ప్రియతంరెడ్డి, నిరంజన్ రెడ్డి, యువరాజ్ మరియు ఆళ్లగడ్డ సబ్ డివిజన్ ఇన్స్పెక్టర్లు ,సబ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

# జిల్లాలో పటిష్టంగా ఉచిత ఇసుక సరఫరా.

### -జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 25: రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లాలో ఉచిత ఇసుక సరఫరాను పటిష్టంగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గనులు భూగర్భ శాఖ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ కుమార్ కు వివరించారు. బుధవారం సాయంత్రం విజయవాడ నందలి గనులు భూగర్భ శాఖ కార్యాలయం నుండి జిల్లాలలో అమలవుతున్న ఉచిత ఇసుక సరఫరా అంశంపై కలెక్టర్లతో గనులు భూగర్భ శాఖ రాష్ట్ర కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్రస్థాయిలో తీసుకున్న నిర్ణయాలను, జిల్లాలో పాటించాల్సిన చర్యలను వివరించారు. ఇందులో భాగంగా రాష్ట్రస్థాయిలో ఇసుక రవాణాలో ఇటీవల తీసుకున్న నిర్ణయాలు, తీర్మానాలు, బుకింగ్ అనంతరం ఇంకను సరఫరా కావాల్సిన ఇసుక పంపకాలు, ఫెసిలిటేషన్ కేంద్రాలలో గుర్తించిన మరియు గమనించిన కీలక సమస్యలు, ఐ వి ఆర్ ఎస్ రిపోర్టు స్టేటస్, జీఎస్టీ తదితర అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై మార్గదర్శకాలను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. అదేవిధంగా జిల్లాస్థాయి ఇసుక కమిటీ మరియు రవాణాదారుల మధ్య సేవాస్థాయి ఒప్పందం అంశం, రవాణా దారుల పనితీరు యొక్క తప్పనిసరి చెల్లింపులో మినహాయింపులు, రవాణా ఖర్చులలో భాగంగా 0-10 కిమీల లోపు, 10 కిమీ పరిధిలో 20 మెట్రిక్ టన్నుల ట్రక్కులకు చెల్లించాల్సిన నిర్ధారిత రేటు, 80 కిమీల పరిధిలో టన్నుల పరిమాణం మరియు కిమీల ప్రకారం రేటు చెల్లింపు తదితరాలను వీసీలో వివరించారు. ఈ సందర్భంగా రవాణా దారుల నమోదు మరియు పోర్టల్ లో సమ్మతిని అందించిన తర్వాతనే ట్రిప్పులు కేటాయించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ సి . విష్ణు చరణ్, మైనింగ్, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.



# అంచెలంచెలుగా అభివృది

### రవాణ, యువజన క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి




కడప ఆంధ్ర ప్రగతి, సెప్టెంబర్ 25
రాష్ట్ర ప్రభుత్వం జిల్లాను అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తుందని రాష్ట్ర రవాణ, యువజన క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. జెడ్పీ చైర్మన్‌గా ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఉన్న సమయంలో రూ. 454.50 లక్షల జెడ్పీ నిధులతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను బుధవారం మంత్రి ప్రారంభించారు. ఎన్నికల హామీలను అన్ని ప్రభుత్వం అమలు చేసి జిల్లాను, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథలలో నడిపించేందుకు కట్టుబడి ఉందని ఆయన అన్నారు. దీపావళి పండుగ రోజు మహిళలకు గ్యాస్ సిలిండర్లు అందించనున్నామన్నారు. అతి త్వరలోనే మహిళా మూర్తులకు ఒక శుభవార్త చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట శాసనసభ్యులు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, కడప, కమలాపురం ఎమ్మెల్యే మాధవీరెడ్డి, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, కలెక్టర్ శివశంకర్ లోతేటి, అధికారులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్ వ్యవస్థను పటిష్టం చేయండి.

### -పిజిఆర్ఎస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 25: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులకు సరియైన ఎండార్స్మెంట్ ఇవ్వకపోయినా, పొంతనలేని సమాధానాలు ఇచ్చినా, పూర్తి సమాచారం పొందుపరచకపోయినా రీఓపెన్ చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పిజిఆర్ఎస్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని పీజిఆర్ఎస్ కమాండ్ కంట్రోల్ రూమ్ ను ఆకస్మికంగా తనిఖీ చేసి పిజిఆర్ఎస్ దరఖాస్తులను ఆడిట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి రాజకుమారి మాట్లాడుతూ పిజిఆర్ఎస్ దరఖాస్తులు ఎస్ ఎల్ ఎ వ్యవధి 24 గంటలు, 48 గంటలలో పరిష్కరించాల్సిన సమస్యలపై సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి పరిష్కరించాలని సూచించారు. రెవిన్యూ , పోలీసు శాఖలకు సంబంధించి అనేక దరఖాస్తులు రీఓపెన్ అవుతున్నాయని సంబంధిత అధికారులను పిలిపించి తక్షణమే క్లియర్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎస్ ఎల్ ఏ వ్యవధి 24 గంటలు మాత్రమే వుండి, పరిష్కరించని అధికారులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడి దిశా నిర్దేశం చేశారు. సమస్యలు నిర్ణీత గడువు దాటి వెళ్ళకూడదన్నారు. ఎస్ ఎల్ ఏ 24 గంటలు వరకు వచ్చిన సమస్యలన్నీ పరిష్కారం అయితే పిజిఆర్ఎస్ వ్యవస్థ పటిష్టంగా పనిచేస్తున్నట్లని కలెక్టర్ తెలిపారు. సమస్యలు వచ్చిన వెంటనే పరిష్కరించే దిశలో అధికారులు వ్యవహరించేలా కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది చురుకుగా పని చేయాలన్నారు. సమస్యను పరిష్కరించని పక్షంలో తగు సంజాయిషీతో అదే రోజు సాయంత్రం కలెక్టర్ ను సంప్రదించేలా అధికారులకు సూచనలు ఇవ్వాలన్నారు. ఆడిట్ లో సరియైన ఎండార్స్మెంట్ లేని ఎనిమిది దరఖాస్తులను గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ కార్యాలయాలకు అర్జీలు పంపించి పరిష్కారం కాని సమస్యల జాబితాను తనకు ఇస్తే వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పిజిఆర్ఎస్ కు సంబంధించి అన్ని పారామీటర్లలో టాప్ 5 లో ఉండేలా పనులు సమర్ధవంతంగా చేయాలని కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు.



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# ఇది కూడా ముంచే ప్రభుత్వమే

### తాలి బజావ్ కార్యక్రమంలో పీసీపీ చీఫ్ షర్మిల ఆగ్రహం



అమరావతి,సెప్టెంబర్25 ఆంధ్ర ప్రగతి: ఇది మంచి ప్రభుత్వం కాదు, ముంచే ప్రభుత్వం, సూపర్ సిక్స్ ఎప్పటి నుంచి అమలు చేస్తారు ? ఒక శ్వేత పత్రం విడుదల చేయండి అని సీఎం చంద్రబాబును ఏపీ పీసీసీ అధినేత్రి షర్మిల డిమాండ్ చేశారు. విజయవాడలో పళ్లెం, గంటెతో తాలి బజావ్ నిరసన కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో మాట్లాడుతూ.. ఇది మంచి ప్రభుత్వమట.. ఊరూరా ప్రచారం చేసుస్తున్నారు, ఇది ఎట్లా మంచి ప్రభుత్వం అవుతుందో సీఎం చంద్రబాబు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.సూపర్ సిక్స్ లో 20 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు, ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు అన్నమాట, %–% ఈ 100 రోజుల ప్రణాళికలో ఉద్యోగాల కల్పన మీద మీ ప్లాన్స్ ఏవీ అన్నారు. 3 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి, %–% వీటిని ఎలా నింపుతారో ప్రణాళికలు లేవు అని షర్మిల అన్నారు. ఈ ఏడాది అన్నదాత సుఖీభవ ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని, 20 వేలు ఇస్తామన్న హామీ అటకెక్కినట్టు ఉందన్నారు. రాష్ట్రంలో భారీ వర్షాలకు 7 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లితే సీఎం చంద్రబాబు కేవలం 2 లక్షల ఎకరాలకు పరిహారం ఇస్తున్నారని, పరిహారం మీద కోత పెట్టిన ప్రభుత్వం ముంచే ప్రభుత్వం కాదా ? అని షక్మిల ప్రశ్నించారు. రాష్ట్రంలో రైతుల కష్టాలు కనిపించడం లేదా ? వరదలో సర్వం కోల్పోతే కేవలం 4 లక్షల మందికే పరిహారం ఇస్తారా ? ఇదే ముంచే ప్రభుత్వం కాకపోతే మరేంటి ? అని షర్మిల అన్నారు.ప్రధాని మోదీకి ఏపీపై చిన్నచూపు ఉందని, ఇక్కడ వరదల్లో సర్వం కోల్పోతే రైల్ నీర్ కూడా ఇవ్వలేదని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేనా మోదీకి రాష్ట్రం మీద ఉన్న ప్రేమ ? రాష్ట్రాన్ని మోసం చేసిన బీజేపీతో ఎందుకు కూటమి కట్టారో బాబు సమాధానం చెప్పాలని షర్మిల అన్నారు. తల్లికి వందనం పథకం అమలు లేదు.. ఎంతమంది బిడ్డలు అంటే అందరికీ 15 వేలు ఇస్తాం అన్నారు.. గత ప్రభుత్వం ఒక బిడ్డకు ఇచ్చారు. ఈ ప్రభుత్వం కనీసం ఒక్క బిడ్డకు కూడా ఇవ్వలేదని విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం ముంచిన ప్రభుత్వం కాబట్టే%‍ా% ఈ ప్రభుత్వాన్ని గద్దెను ఎక్కించారు. ఈ ప్రభుత్వం కూడా ముంచే ప్రభుత్వం అని ప్రజలు భావస్తున్నారు.ఆ పథకం కింద ఇచ్చే 15 వందలు ఎక్కడ ? కోటి మంది మహిళలకు ఎప్పుడు పథకం వర్తింప జేస్తారని షర్మిల ప్రశ్నించారు. మనది రాజధాని లేని రాష్ట్రమే కాదు%‍ా% బడ్జెట్ లేని రాష్ట్రం కూడా ఉందని విమర్శించారు. 100 రోజుల్లో బడ్జెట్ పెట్టే ధైర్యం లేదు.. ఏ పథకానికి ఎంత బడ్జెట్ చెప్పే ధైర్యం లేదు, అని మండిపడ్డారు. కనీసం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించే ధైర్యం కూడా చేయడం లేదు. గతంలో జగన్ సర్కార్ విశ్వసనీయత కోల్పోయింది, ఇప్పుడు బాబు సర్కార్ మీద కూడా జనాలు నమ్మకం కోల్పోతున్నారని షర్మిల అన్నారు. ఎన్నికలకు ముందే రాష్ట్రంలో 11 లక్షల కోట్లు అప్పులు అని మీకు తెలుసు.. మీరు మంచి చేస్తారని ప్రజలు ఓటేశారు, కానీ ఇచ్చిన హామీల నుంచి తప్పించుకోవటం మంచిది కాదన్నారు.

## తిరుమల వ్యవహారం జగన్‌కు ఒక రాజకీయ ఈవెంట్

### మాజీ సీఎం జగన్‌పై మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్ర విమర్శలు



అమరావతి,సెప్టెంబర్25 ఆంధ్ర ప్రగతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారం ఏపీలో రాజకీయ మంటలు రాజేస్తోంది. నెయ్యి కల్తీ జరగకపోయినా జరిగినట్టు అసత్య ప్రచారం చేస్తున్నారంటూ వైసీపీ నేతలు వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో కూటమి నేతల పాపాలను క్షమించి వదిలేయమని వేంకటేశ్వర స్వామిని కోరుతూ సెప్టెంబర్ 28న రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల్లో పూజలు చేయనున్నట్టు వైసీపీ ప్రకటించింది. ఈ ప్రకటనపై ఏపీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత పయ్యావుల కేశవ్ స్పందించారు.వైసీపీ ఎమ్మెల్యే జగన్ ఈ నెల 28వ తేదీన పూజలు చేయాలని పిలుపిచ్చారని... ఆయన మారలేదని, ఆయన దురాలోచనలు మానుకోలేదని మంత్రి విమర్శించారు. తిరుమల వ్యవహారం జగన్‌కు ఒక రాజకీయ ఈవెంట్ అని, కానీ తమకు ఇది ఓ సెంటిమెంట్ అని ఆయన వ్యాఖ్యానించారు. జరగని అపచారాన్ని జరిగిందని చెప్పడానికి తమకేం అవసరమని మంత్రి ప్రశ్నించారు. జరిగింది కాబట్టే చెబుతున్నామని స్పష్టం చేశారు. జగన్‌కు దేవుడి మీద నమ్మకం లేకపోవడంతోనే ఈ తప్పులు జరిగాయని అన్నారు.

వేంకటేశ్వర స్వామి వారి మీద జగన్‌కు నిజంగా నమ్మకం ఉంటే తిరుమలలో డిక్లరేషన్ మీద సంతకం చేయాలని సవాలు విసిరారు. జగన్ చేసిన తప్పులకు భక్తులు ప్రాయశ్చిత్తం చేసుకుంటున్నారని విమర్శించారు. ప్రజల మనోభావాలతో ఆడుకుంటున్నది చాలు అని మంత్రి పయ్యావుల కేశవ్ మండిపడ్డారు."జగన్ చేసిన పాపాలు ఇక చాలు. కల్తీ నెయ్యి నిజం... ఆ కల్తీ నెయ్యి లడ్డూల్లో వినియోగించింది నిజం. అపచారం జరిగింది నిజం. జగన్ అబద్ధం... జగన్ చేసే పూజలు అబద్ధం" అని ఆయన విమర్శించారు. పాలకుడు మారాడు కాబట్టే తిరుమలలో నిజాలు బయటకు వస్తున్నాయని మంత్రి వ్యాఖ్యానించారు. గతంలో ఉన్న లడ్డూ నాణ్యతకు, ప్రస్తుతం ఉన్న లడ్డూ నాణ్యతకు తేడా ఏంటని భక్తులని అడగాలని, అప్పుడు వాస్తవాలు తేలుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. మహాద్వారం నుంచి సీఎం వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు మాత్రం వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారానే దర్శనం చేసుకుంటున్నారని ప్రస్తావించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీలోని ఓ మెంబర్ నెయ్యి వ్యవహారంపై అనుమానాన్ని వ్యక్తం చేశారని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. తక్కువ ధరకు స్వచ్ఛమైన నెయ్యి ఎలా వస్తుందని ఉత్తర భారతదేశానికి చెందిన ఓ సభ్యుడు లేవనెత్తారని, కానీ నాటి ఈవో ధర్మారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి అణగదొక్కారని మంత్రి ఆరోపించారు.

## బోటు కుట్రదారులను వదలబోం

### వరదసాయం అందచేసిన సిఎం చంద్రబాబు




అమరావతి,సెప్టెంబర్25 ఆంధ్ర ప్రగతి: ప్రకాశం బ్యారేజీని ఢీకొన్న బోట్ల ఘటనలో ఖచ్చితంగా వైసీపీ కుట్ర ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. బోట్లతో ప్రకాశం బ్యారేజీని ఢీకొట్టించారని మండిపడ్డారు. విజయవాడ కలెక్టరేట్‌లో వరద బాధితులకు నష్టపరిహారాన్ని సీఎం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... కనీస బాధ్యత లేకుండా ఆంబోతుల మాదిరి వ్యవహరించారంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అనంతపురంలో రథం కాల్చేశారన్నారు. బోట్ల విషయంలో కుట్ర పన్నిన వారిని అరెస్ట్ చేస్తామని స్పష్టం చేశారు. నేను అసమర్థుణ్ని కాను.. ఎవరు ఏం తప్పు చేసినా తెలిసేలా వ్యవస్థను ఎస్టాబ్లిష్ చేస్తున్నాం. ఎవరైనా కుట్రలు పన్నితే ఖబడ్దార్ అంటూ సీఎం చంద్రబాబు హెచ్చరించారు.వరద నష్ట పరిహారం కోసం 13వేల మంది అదనంగా దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు సాయం అందిస్తామన్నారు. అనర్హులు ఉంటే ఎందుకివ్వలేక పోయామో చెబుతామన్నారు. నేనిక్కడ బటన్ నొక్కడం లేదు.. బటన్ నొక్కి ఫూల్స్ చేయడం లేదు. నేరుగా బాధితుల ఖాతాలకే సాయం అందిస్తున్నాం. కుమ్మరిపాలెంలోని 38 వార్డులోకి త్వరలో ఆపరేషన్ బుడమేరు ప్రారంభిస్తామని ప్రకటించారు. ఇంకా కేంద్రం సమావేశాలు పెట్టుకుని.. ఏపీకి చేయాల్సిన వరద సాయంపై చెబుతారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# సనాతన ధర్మం జోలికి వస్తే ఊరుకునేది లేదు.!

### -ఆళ్లగడ్డ జనసేన సమన్వయకర్త మైలేరి మల్లయ్య.

### -పవన్ కళ్యాణ్ కు సంఘీభావం తెలుపుతూ నిరసన దీక్షలో పాల్గొన్న ఆళ్లగడ్డ జనసేన నాయకులు.




ఆంధ్ర ప్రగతి ఆళ్లగడ్డ సెప్టెంబర్ 25: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని ఆళ్లగడ్డ జనసేన సమన్వయకర్త మైలేరి మల్లయ్య హెచ్చరించారు. బుధవారం

ఆళ్లగడ్డ మండలంలోని పడకండ్ల గ్రామంలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం తిరుమల క్షేత్రంలో జరిగిన లడ్డు అపవిత్రతపై జనసేన నాయకులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా ఆళ్లగడ్డ జనసేన పార్టీ సమన్వయకర్త మైలేరి మల్లయ్య ఆధ్వర్యంలో దీక్షా కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకుముందుగా శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి జనసేన నాయకులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మైలేరి మల్లయ్య మీడియాతో మాట్లాడుతూ కోట్లాదిమంది భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వైఎస్ఆర్సిపి నాయకులు ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. వైసీపీ నాయకులు రాజకీయం చేసుకోవాలని.. సనాతన ధర్మం జోలికి వస్తే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు. తమ నాయకుడు పవన్ కళ్యాణ్ పేదల పాలిట పెన్నిధి అని.. కౌలు రైతులు ఆత్మహత్య చేసుకున్నప్పుడు సిరివెళ్ల మండలంలో 135 మంది కౌలు రైతుల ఆత్మహత్య చేసుకోవడం జరిగిందని ఒక్కొక్క కుటుంబానికి లక్ష రూపాయలు చొప్పున 1.35 కోట్ల రూపాయలు తమ నాయకుడు పవన్ కళ్యాణ్ పరిహారాన్ని అందజేయడం జరిగిందన్నారు. 135 కుటుంబాలలో ముస్లిం, దళిత సోదరులు కూడా ఉన్నారని తెలియజేశారు. మసీదులో, చర్చిలలో ఎలాంటి సంఘటనలు జరిగిన ధైర్యంగా బయటికి వచ్చే మాట్లాడే వ్యక్తి పవన్ కళ్యాణ్ గారిని తెలియజేశారు. గతంలో మసీదులలో పనిచేస్తున్నటువంటి ఇమాములకు చర్చిలలో పనిచేస్తున్నటువంటి పాస్టర్లు కూడా ఆర్థిక సాయం అందజేశారని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ బిజెపి ఇన్చార్జి బోర్ రెడ్డి లక్ష్మి రెడ్డి, డాక్టర్ రాము, అడ్వకేట్ మురళీధర్ గౌడ్, ఆదినారాయణ రెడ్డి, ఆర్ఎస్ఎస్ నాయకులు సోముల శ్రీనివాస్ రెడ్డి, బలిజ సంఘం నాయకులు అర్జీ గారి నరసింహుడు, ఆకుల నడిపి వెంకటసుబ్బయ్య, జనసేన నాయకులు జనసేన నాయకులు మైలారి శ్రీరాములు, రాచంశెట్టి వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

# రైతులు విచక్షణ రహితంగా ఎరువులు,పురుగుమందులు వాడకూడదు

### -మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రెడ్డి.




**ఆంధ్ర ప్రగతి మహానంది సెప్టెంబర్ 25:** రైతులు విచక్షణ రహితంగా ఎరువులు, పురుగుమందులు వాడకుండా పంటను పరిశీలించి, గమనించి, చర్చించిన తర్వాతే ఒక నిర్ణయం తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బి. నాగేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.బుధవారం మహానంది మండలం ఆర్.ఎస్ గాజులపల్లె, గోపవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. మహానంది హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ అండ్ హెడ్ ముత్యాల నాయుడు మాట్లాడుతూ.. అరటి పంటలో సాగు యాజమాన్య పద్ధతులు, పురుగులు,తెగుళ్ల నివారణ గురించి రైతులకు సూచనలు ఇవ్వడం జరిగింది. అరటిలో సిగటోక ఆకు మచ్చ తెగులు నివారణకు, ప్రోపి కొనజోల్ అనే మందును ఒక లీటర్ నీటికి ఒక మిల్లీలీటరు,ఐదు నుండి పది మిల్లీ లీటర్ల మినరల్ ఆయిల్ కలుపుకొని ఆకులపై పిచికారీ చేసుకోవాలి అని తెలిపారు.ప్రతి అరటి మొక్కకు 400 గ్రాముల యూరియా , 320 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను నాలుగు దఫాలుగా ప్రతి 40 రోజులకు ఒకసారి వేసుకోవాలి అని తెలిపారు. పసుపులో ఆకుమచ్చ తెగులు నివారణకు ప్రోపికోనజోల్ అనే మందును పిచికారి చేసుకోవాలి అని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ.. రైతులు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడుట ద్వారా వ్యవసాయంలో సాగు ఖర్చు తగ్గించుకోవచ్చునని తెలిపారు. రైతులు మినుము వేసే ముందు ఇమిడాక్లోప్రిడ్ అనే మందును ఐదు మిల్లీ లీటర్లు ఒక కిలో విత్తనానికి లేదా థయోమితాక్సం అనే మందును ఐదు గ్రాములు ఒక కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా, మినిము పంటను ఇరవై రోజుల వరకు రసం పీల్చు పురుగుల భారి నుండి రక్షించుకోవచ్చు అని, మినుము పంటలో పల్లాకు తెగులు, వైరస్ తెగుళ్ల వ్యాప్తి చెందకుండా ఉండటానికి మరియు వరి పంటలో దోమ నివారణకు పంట తొలి దశలలో వేప నూనె ను పిచికారి చేసుకోవాలని తెలియజేశారు. వరి పంటలో సింథటిక్ పైరి త్రాయిడ్ మందులు వాడరాదన్నారు. వరి పంటలో ఆకు ముడత మరియు కాండం తొలుచు పురుగు ఉధృతిని తెలుసుకోవడానికి ఎకరానికి నాలుగు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలనన్నారు.వరిలో పై పాటుగా భాస్వరం ఎరువులు వాడరాదని, ముడి జింకును భాస్వరం ఎరువులతో కలిపి వాడ రాదని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పొలంలో పంటకు మేలు చేసే మిత్ర పురుగుల సంఖ్యను పెంచుకోవచ్చు అని రైతులకు తెలిపారు. పశుసంవర్ధక శాఖ అధికారి అనురాధ మాట్లాడుతూ.. పశువులకు వచ్చే వ్యాధులు వాటి నివారణ గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ రాముడు, పంచాయతీ సెక్రటరీ భాస్కర్, ఏఈఓ శ్రీనివాసరెడ్డి, వెటర్నరీ అధికారి అనురాధ, ఆర్ఎస్ గాజులపల్లి సర్పంచ్ అస్లాం భాష , గోపవరం సర్పంచ్ సుదర్శనం, మాజీ సర్పంచ్ రాముడు, గ్రామ ఉద్యాన సహాయకులు హరిత , గ్రామ పెద్దలు,రైతులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఇచ్చిన హామీలు మరచిన కూటమి ప్రభుత్వం.!

### -ముఖ్యమంత్రి గారూ సామాజిక ఫించన్లు పంపిణీ సరే మిగతా హామీల ఏమయ్యాయి.

### -జే లక్ష్మీ నరసింహ యాదవ్ కాంగ్రెస్ నంద్యాల పార్లమెంట్ జిల్లా డిసిసి అధ్యక్షులు మరియు ఏఐసిసి మెంబర్.

### ఎన్నికల కంటే ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలి.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ సెప్టెంబర్25:** ఏపీసీసీ కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి వైఎస్ షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు నంద్యాల పార్లమెంట్ డిసిసి అధ్యక్షులు లక్ష్మి నరసింహ యాదవ్ అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది అనంతరం లక్ష్మీ నరసింహ యాదవ్ మాట్లాడుతూ తెలుగుదేశం జనసేన బిజెపి ఉమ్మడి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు సూపర్ సిక్స్ పథకాలు 100 రోజులైనా అమలు చేయకపోవడం తెలుగుదేశం ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనం ఈ నిద్రపోతున్న ప్రభుత్వాన్ని మేల్కొలపడం కోసం వారు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ స్టీల్ ప్లేటు గరిటెలతో కలెక్టరేట్ దగ్గర శబ్దలు చేస్తూ నిరసన తెలియజేశామని అన్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న హామీ మేరకు ప్రతి నెలా మొదటి తేదీన ఇంటివద్దనే లబ్దిదారులకు సామాజిక ఫించన్లు పంపిణీ చేయడం హర్షణీయం. కానీ మిగతా హామీలు అటక ఎక్కించారు. బిసి,యస్సీ,ఎస్టీ,ముస్లిం మైనారిటీలకు 50 ఏళ్లకే ఫించన్ ఇస్తామని మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చారు. జులై,ఆగష్టు,సెప్టెంబర్ 3 మాసాలు గడిచిపోయాయి. అమలు కాలేదు. యువ గళం క్రింద నిరుద్యోగ యువతకు నెలకు 3వేల రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. ఇప్పటివరకు అమలు కాలేదు. తల్లికి వందనం పథకం క్రింద స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ15,000లు ఇస్తామన్నారు. ఇవ్వలేదు. అన్నదాత సుఖీభవ పథకం క్రింద ప్రతి రైతు కు ఏటా రు 20,000 లు ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు చేరుకుంది. ఇంతవరకు 20 రూపాయల సాయం కూడా చేయలేదు. 19 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ 1500 ఇస్తామన్నారు. ఇవ్వలేదు. ప్రతి ఇంటికీ ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తామన్నారు. చేయలేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అన్నారు. అమలు కాలేదు. పైనా పేర్కొన్న హామీ లను వీలైనంత త్వరగా అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది. ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య , మాజీ ఉపాధ్యక్షులు బాలస్వామి , బోయ రమణ , శ్రీనివాస్ గౌడ, బి హుస్సేన్ భాష , రహ్మాన్ భాష , కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ జాకీర్ హుస్సేన్ , కురువ రవి కుమార్ , దాట్ల శ్రీరాములు యాదవ్ , నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.